# వయసూ - మనసూ

## స్నేహలత

"మినార్ ఎక్స్‌ప్రెస్ మరో పది నిమిషాల్లో నాలుగవ నెంబరు ప్లాటు ఫారమ్ నుండి బయలుదేర నున్నది. ఎనౌన్సర్ మైక్‌లో చెప్పింది.

రాధాదేవి కన్నుల్లో నీరు చిమ్మింది. తన కొడుకు హైద్రాబాద్ నుండి బొంబాయికి వెళ్ళి అక్కడ నుండి విదేశాలకు వెళ్ళబోతున్నాడు. మరి కొద్ది క్షణాలలో ఈ రైలు తన కొడుకుని తనకి దూరంగా తీసుకుపోతుంది. ఎంత కాదనుకున్నా ఆమెకిది భరించరాని వేదనగా ఉంది.

"బాబూ!"

"ఏమిటమ్మా! ఏడాదికల్లా తిరిగిరాను నీ దృష్టిలో ఇంకా చిన్న పిల్లాడినే కాని...."తల్లి మమకార మెరిగిన కొడుకు మాట పూర్తి చేయకముందే తండ్రి నవ్వాడు.

"మీ అమ్మకి నువ్వు చిన్నవాడివే నోయ్ అంతేకాదు. నేనూ ఆమెదృష్టిలో అంతేలే. ఔనా! చాల్లేవే ప్రేమ" ఆమె చప్పున ఎటో చూస్తున్నట్టు తల తిప్పింది శంకరంగారికి భార్య మనసు తెలుసు. మరేమీ ఆలోచించకుండా టీ.సి.ని పిలిచి ఏదో అడిగాడు. వెంటనే తను దిగిపోయి పర్సులోంచి పది నూర్రూపాయలు నోట్లు ఆమె చేతిలో పెట్టి. "చూడు; అబ్బాయిని బొంబాయిదాకా దిగవిడచి వచ్చేయ్. టిక్కెట్టు సంగతి ఆయనకుచెప్పానులే."

ఆమె "వద్దు. దిగిపోతానులే" అనే లోపునే బండి కదిలింది. బండి పదిగజాలు సాగి వేగమందుకుంది. ఆమె ముఖంలో ఆనందం చూసి తండ్రితో బాటు కొడుకుకూ సుఖంగా, శాంతిగా అనిపించింది.

మరునాడు కొడుకుని ప్లేన్ ఎక్కించింది. వేయి జాగ్రత్తలు చెప్పి తిరిగి టాక్సీలో "రాయల్ మాచ్ క్లబ్ ఆఫ్ బాంబే"కి వచ్చేసింది. దేశంలో ఏ మూలకు పోయినా ఓ మద్రాస్ హోటల్ కనబడుతుంది. రాధాదేవి శాకాహారి. క్లబ్‌తో మాంసాహారం తప్ప మరేమీ లేనట్లు లెక్క. బొంబాయిలో కావలసిన వాళ్ళు ఉన్నా ఎందుకో ఆమెకి ఎవరి దగ్గరకు వెళ్ళాలనిపించలేదు. అవసరమైన షాపింగ్ చేసుకుని మద్రాస్ హోటల్‌లో ఇంత అన్నం తిన్నది. ఏమిటో వెలితిగా అనిపిస్తోంది. హఠాత్తుగా తాను లోకంలో ఒంటరిగా మిగిలిపోయినట్లు అనిపించింది. మరో మూడు రోజులకు గానీ ఆమెకు రిటర్న్ టికెట్ దొరికేలా లేదు. ఏం చేయాలి? ఆమెకు మూడు. నాలుగు భాషలు వచ్చును. అయినా తెలుగులో బాగా మాట్లాడాలనిపిస్తుంది. ఎక్క-

దైనా తెలుగువారో. తెలుగుమాటలో వినిపిస్తే ఎంత బాగుండును? జీవితంలో ఇంత కాలానికి అనుకోకుండా ఇలా రావటం.ఒంటిగా కొత్తచోట ఉండటం చిత్రమైన అనుభూతి. తన చుట్టూ తెలుగే ఉన్నప్పుడు దాని విలువ తెలిసి రాలేదు గానీ, ఈ రోజు సంసారానికి దూరంగా ఒంటరిగా ఉంటే–అంతులేని ఆలోచనలు.

స్వతహాగా ఆమె చాల చురుకైనది. తెలివైనది. ధైర్యశాలి. అయినా ఇప్పుడు తాను అబల ననుకుంటున్నది. తనకీలోకం మెరుగనట్లున్నది. ఎవరికెవరు ఏమి కారా? రెక్కలొచ్చిన బిడ్డలు తనని వదిలి దూరంగా బ్రతకగలరన్నిమాట. తను చనిపోతే భర్త మళ్ళీ పెళ్ళిచేసుకుంటారా ఛ.ఛ. వెధవ ఆలోచనలు నిద్ర రాదేం? ప్రక్కమీద నుండి లేచి వరండాలో కుర్చీలో కూర్చుంది.బేరర్ తెచ్చిన లస్సీ కొద్దికొద్దిగా స్ట్రాతో పీలుస్తున్నది.

ఎక్కడో సన్నని పాట, రేడియోనా? టెలివిజన్ నుండా? ఏదైతే తనకేం? ఆమె గొంతులోంచి సన్నని రాగం తీగలా సాగింది. పల్లెపదాలు, జానపదుల పడవ పాటలు కూనిరాగాలుగా మొదలై పక్క వారికి వినిపించేలా గాలిలో తేలినై. ఆ క్లబ్‌లో వి.ఐ.పి.లు తప్పఎవరూదిగరు. ఒకరిద్దరు అటుగా తమ గదులకు పోతూ ఆమె పాట క్షణంసేపు వినాలన్నట్లు ఆగి-మర్యాదగాదని మళ్ళీ కదిలి పోయారు, తీయదనాల తెలుగు తేనియ చెవుల్లో నింపుకుని మరీ పోయారు. ఆమె గొంతులో రాగం గుండెలోని బిగువును తీసిపారేసింది. ఎన్నడో చాల కాలం క్రితం– చదువుకునే రోజుల్లో, పెళ్ళి అయిన అనంతరం కొత్త జీవితంలో మధురంగా పాడిన ఆ పాటలు మళ్ళీ ఈనాడు తాను పాడగలిగిందా? అసలు పాడిందా? మనసులోనే ఊహించుకుందా! ఏ మగాడి మనసు తేలిపోతున్నది. కళ్ళల్లో నిద్ర ముంచుకొచ్చి ఆవులింతగా వెలువడింది. ముడిలోని ఒకో పిన్నూ చేతిలోకి తీసుకుంటూనే మెల్లగా లేచి గదిలోకి నడిచింది. బెడ్ లైట్ ఆపి ఫాన్ స్పీడు హెచ్చించి మెత్తదనాల తెల్లని పక్కమీద దోమతెర సరిచేసుకున్నది. మెల్లగా, హాయిగా, కలలా నిద్ర పట్టేసింది.

బెడ్‌కాఫీకై బెల్ వినిపిస్తుందేమో నని బేరర్ కాస్సేపు చూసి వెళ్ళి పోయాడు. బ్రేక్‌ఫాస్ట్‌కి ఆమెకి మెలకువ వచ్చి చుటూ చూసింది; అరె! అనుకుంటూ బాత్ రూమ్‌లోకి నడచింది. షవర్ క్రింద నిలబడి బాత్‌టబ్ కూడ నింపింది. అరగంట సేపయినాక బైట పడి డ్రస్ చేసుకునేసరికి 9–30 నిమిషాలయింది. బెడ్ కాఫీ లేకుండా యింత వరకు ఎలా ఉన్నానో అనుకుని ఆశ్చర్య పోయింది. బ్రేక్ ఫాస్టు టైమ్ కూడ అయిపోయినట్లుంది. డైనింగ్ హాలులో ఆట్టే సందడి లేదు. ఆరీ ఆరని తల జారుముడి వేసుకుని అటుగాఉన్నకుర్చీ– ఒకేసారి 20 మందికి వడ్డించడానికి సరిపడే ఆ టేబిల్‌ముందు తానుగాక మరో ఇద్దరు చివరన కూర్చున్నారు. ఇద్దరూ మిత్రులు కాబోలు ఒకరు తిని రెండోవాని కోసం కాఫీ సిప్‌చేస్తూ చిన్నగా మాట్లాడుతున్నాడు. అతనికి కాఫీ పూర్తి చేసి

సిగరెట్ కాల్చాలని వుంది. పరస్త్రీ అనుమతి లేనిదే సిగార్ వెలిగించడం పాడి గాదు. ఆమెను పలకరించాలంటే బిడియంగా వుంది. ఆ రెండో అతనికి అవేమీ పట్టినట్లు లేదు. చాలా దీక్షగా, ఆకలిగా, ఆశగా, తృప్తిగా తన ప్లేట్ లోని బ్రెడ్ స్లయిస్‌కి తీరిగ్గా, జామ్, బట్టర్ రుద్ది తింటున్నాడు. సగం తిన్న ఆమ్లెట్ ఫోర్క్‌తో గుచ్చి ఎందుకో తలెత్తి పక్కకి చూశాడు. అంతే, ఫోర్క్ మీద ఆమ్లెట్ జారిపడింది. రాధాదేవి నవ్వింది.చనువుగా, శాంతంగా, చల్లగా, వెన్నెల జల్లులా నవ్వింది. అతడు తినే తీరు చిత్రంగా వుంది. చిన్న స్కూల్ పిల్లాడిలా వేళ్ళు కంటిన జామ్‌నీ, బట్టర్‌నీ అంతా తనకేనన్నట్లు, తానే తినగలిగినట్లు చప్పరిస్తూ తింటుండడాన్ని ఆమె గమనిస్తూనే వున్నది. తన కొడుకు కిరణ్ చిన్నప్పుడు ఇంత తృప్తిగా వేళ్ళు నాకుతూ తినేవాడు. ఇప్పుడు ఒంటరిగా విదేశాల్లో – ఆమెకు ఎదురుగా తినే అతని రూపంలో తన కొడుకులా అనిపించింది. చక్కగా, ఆరోగ్యంగా, అందంగా, హాందాగా వున్నది ఆమె.

"ఊం. తినండి." అన్నది.

అన్నాకగానీ తాను తెలుగులో మాట్లాడిన సంగతి గుర్తించ లేదు. వెంటనే "ఎస్, కారీ ఆన్" అన్నది నవ్వుతూనే. కాని నవ్వడం ఆపి తెల్లబోవలసివచ్చింది ఆమె. ఎందుకంటే,

"నమస్తే మీరు టిఫిన్ ఆర్డర్ చేయ లేదా?" అన్నాడు అతను.

"బేరర్!" అని కేకేసాడు రెండో అతను.

అరె! వీళ్ళు తెలుగు మాట్లాడుతున్నారేమిటి? చూస్తే అలా లేరు. కాని ఎక్కడో.... ఎక్కడో తెలుగు ఛాయలు తొంగి చూస్తున్నాయి. ఆ! అదీ సంగతి, ఇద్దరూ నేత లాల్చీలు, సన్నంచు పంచెలూ కట్టి వున్నారు. ఆలస్యంగా లేచి, ఆదరా బాదరాగా ముఖం కడిగేసి టిఫిన్‌కి ఎగబడ్డారన్నమాట!

బేరర్ పారిడ్జ్ బోయిల్డ్ ఎగ్ తెచ్చి ఆమె ముందుంచాడు. ఆమె గుడ్డుని అతని ముందుకు జరిపి "తినండి" అన్నది.

"అదేం? మీకూ!"

"ఉహూ. నేను వెజిటేరియన్. మీరు తీసుకోండి. చాలా లేక యింక తెప్పించనా?" అన్నది.

"ఇంకా నయం. మీ కక్కర్లేనివన్నీ మా కిచ్చేటట్టున్నారు. మీరు రాకముందు అరగంట నుండీ తింటూనే వున్నాం. బేరర్ ఖాళీ ప్లేట్లు తీసేసాడు. లేకపోతే టేబిల్ నిండా డజన్ల కొద్దీ ప్లేట్లుండేవి. మీరు జడుసుకునేవారే!"

ముగ్గురు నవ్వారు. సువాసనలు వెదజల్లే కాఫీ పాట్‌లోంచి మూడు కప్పులూ నింపిందామె.

"ఏ ఊరు మీది? తెలుగు ఎలా వచ్చు?"

"తెలుగా?. అదే, కొన్నాళ్ళు మీ దేశంలో పొట్టతిప్పలు పడ్డాంలెండి.నాలుగయిదు ముక్కలు పట్టేశాం. వేషం వేశాం. మేం తెలుగు వాళ్ళలాగా లేమా? మీరు ఒప్పుకోరా?"

"నేను వప్పుకున్నంత మాత్రాన ఐపోతారేమిటి చెప్పండి. ఏ ఊళ్లో పని చేశారు?"

"చూడండి. మీ పేరు మిసెస్...."

"రాధాశంకర్" అని అందించింది ఆమె. వాళ్ళు తెలుగు పట్టిపట్టి మాట్లాడుతుంటే తమాషాగా వుంది.

"నేను చందూ మిత్రాని. ఇతను నా మిత్రుడు రతన్‌లాల్" అన్నాడు లేచి నుంచుని చందూ.

"మనం అలా లాన్‌లో కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ దారితీశాడు అతనే. రాధాదేవి వాళ్ళతో పాటు లాన్ లోకి దారితీసింది.

గాలికి ఎగిరే ముంగురుల మధ్య ఎర్రని కుంకుమ, వెంకటగిరి జరీ చీర, చేతినిండా చక్కని గాజులు, తెలుగు ఆడపడుచుల ప్రతీకలాగ ఆమె కూర్చున్నది. ఒంటిరవ్వ ముక్కుపుడక ఎండ పడినప్పుడల్లా జిగేల్ మంటున్నది. కాటుక పెట్టకపోయినా అందంగా, విశాలంగా ఉన్న కనులు, స్వచ్ఛమైన చిరునవ్వు ఆకర్షణీయంగా ఉన్నదామె.

"విత్ యువర్ పర్మిషన్" అంటూ సుతారంగా సిగరెట్ తానొకటి వెలిగించి అతనికి ఒకటి అందించాడు.

"మీరు చక్కగా పాడారు"

రా ధా దే వి ఉలిక్కిపడింది. పాట! తాను పాడిందా! ఎప్పుడూ? ఓహో రాత్రి. అయితే నిజంగా తాను పైకి పాడిందా? వీళ్ళు విన్నారన్నమాట. అయినా ఆమె అంత తేలిగ్గా ఒప్పుకోదల్చుకోలేదు.

"మీరు గాని కలగంటున్నారేమిటి! నేను పాడటమేమిటి? రేడియోలో గానీ...."

చందు కొంటెగా నవ్వాడు.

"ఔనౌను. రేడియోలో బొంబాయిలో అర్ధరాత్రి లాన్స్ కుర్చీలో మనిషిలాగా మారిపోయి తెలుగు పాటలే పాడ్డం నిజమే." రాధాదేవి ఇక లాభం లేదనుకుంది. "ఏదో కూనిరాగం మనసు సరిగా లేక...."

"మనసు సరిగాలేదా? ఇంకేం పదండి అలా 'హేంగింగ్ గార్డెన్స్'వేపు వెళ్దాం"

అతని చనువుకి ఆమె విస్తుపోయింది. తనెవరో, తన వయసెంతో ఆతనికి తెలియదా – అవేవీ పట్టించుకోడా. తెలుగుదేశంలో ఎన్నాళ్ళున్నాడో గాని తెలుగు స్త్రీలతత్వాన్ని తెలుసుకోనేలేదా? తన వూరులో తనవాళ్ళుగాని పురుషుల్తో ఒంటరిగా వెళ్ళే అలవాటు ఇతనికి ఉండదని చెప్పినా అర్థం కాదేమో? అయినా తనకి పనేమీ లేదు. కా సే ప లా పోతేనేం?

కాని రతన్ బయ్యా నేను రాలేనన్నాడు. తనకోసం మరెవరో వస్తారట. వాళ్ళతో పాటు తనో విందుకు వెళ్ళాలట. రాధ చందుతో పాటే రోడ్డు పక్క బాటమీద నడుస్తుంది. ఆమె ఏదేదో మాట్లాడుతుందిగాని మనసు పరిపరి విధాల పోతున్నది. తనేమిటి ఇలా ఎవరితోనే రావడమేమిటి. కాదు రాలేనని అనలేకపోయిందెందుకని? ఆమె దృష్టిలో తన కొడుకు కిరణ్ పెరిగి పెద్దవాడై చందులాగా పరిపూర్ణపు మనిషిలా వూహించుకొంటున్నది. మళ్ళీ ఆ వూహని పక్కకు నెట్టేస్తున్నది.

ఇతనిష్ట కాదని వెనక్కి తిరిగి బంగళాకి వెళ్ళిపోవడం మర్యాద కాదు.

బొంబాయిలో హాయిగా విశ్రాంతి తీసుకోగల స్థలాల్లో హేంగింగ్ గార్డెన్స్ ముఖ్యమైందని చెప్పాలి. నిజానికి ఆకాశంలో అది వేలాడదుగాని అక్కడి కొచ్చిన మనుష్యుల్ని మాత్రం ఆకాశంలో విహరించేలా చేస్తుంది. రకరకాల వాళ్ళు–ఎంతో అందమైనవాళ్ళు–ఖరీదైన వాళ్ళు – ఎక్కువగా జంటలు – అంటే దంపతులే అని కాదు? కేవలం జంటలు పొదలమాటు ఒంటిగా, జంటగా ఆశగా ఆనందంగా ఇంతమంది ఇలా పబ్లిక్‌గా ఎవరూ పట్టించుకోరేం అనుకొంటున్నది రాధాదేవి. తల మోకాళ్ళమీద ఆన్చి కూర్చొని. చందూ ఆమె ముఖంలోకి చూస్తూ లాన్‌లో ఒరిగిలా పడుకొని ఒక చెయ్యి తలక్రింద దిండులా పెట్టుకున్నాడు. మరో చేయి చాచి ఆమె చుబుకాన్ని ఒక వేలితో పైకి ఎత్తాడు. షాక్. విద్యుత్ తరంగంలోని మనిషిలాగా ఆమె ఆశ్చర్యబోయి అతని కన్నుల్లోకి ఆశ్చర్యంగా చిత్రంగా చూసింది. ఆ చూపులో ఏ భావమున్నదో? ఆమె సర్దుకు కూర్చుంది. తడబడింది. ఆకులా ఒణికింది.

చందు కళ్ళలో మెరుపు – మీరలా తలవంచుకూర్చుంటే నేను మీ ముఖం చూడ్డానికి నేను నేలమీద పడుకోవలసి వచ్చింది. అక్కడంతా సర్దాగా మాట్లాడి ఇక్కడిలా మౌనవ్రతం పట్టారేమిటి?

ఆమె ఇంకా అలానే అతనివంక చూస్తూ విషాదంగా నవ్వింది. చాలా ఏళ్ళక్రింద పెళ్ళయిన కొత్తలో ఇదే గార్డెన్‌లో భర్త ఇలాగ పడుకొని ఇలాంటి మాటలే అన్నాడు. మాట్లాడవేం రాధా? ఏం మాట్లాడను? నన్ను నా అందాన్ని మీరు కళ్ళలో కట్టేస్తుంటే మీరు మాట్లాడుతూనే ఉండండి. నేను వింటూ కూర్చుంటాను అన్నది సిగ్గుగా.

అంత సిగ్గేమిటి? ఒకసారి మన చుట్టూ చూడు ఎలాంటి వాతావరణమో! ఎలాంటి ప్రేమికులో.... మరి మనం దంపతులం కదా వాళ్ళలా నడివీధిలో ఏం కర్మ? ఓసి తెలుగుపిల్లా – ఇది విహార స్థలం. ఇందులో చాలామంది కొత్తగా పెళ్ళయినవాళ్ళు పెళ్ళి చేసుకోబోయే వాళ్ళు.... అలా అంటూనే శంకర్ రాధని కౌగలించుకున్నాడు. అతి ప్రయత్నం మీద అతని ముద్దుని తప్పించుకుంది రాధ. కొత్త పెళ్ళికూతురు బెరుకుతో. శంకర్ షర్టుమీద కుంకుమ, కాటుక మరకలు అచ్చుపడిపోయాయ్. ఆరె ఇప్పుడెలా? అమాయకంగా ఉన్న రాధ పెదాలు మరో మాట రాకముందే మూసుకుపోయాయ్ భర్త కౌగిలిలో. ఊపిరి లాగేసేలాంటి ముద్దు తేనూరించే ముద్దు. ఓ నిమిషం గింజుకొని అతనికి అంటుకుపోయిందామె. ఆ తర్వాత నలిగిన చీరను సరిచేసుకొని, చెదిరిన జుట్టుని ఏం చెయ్యలేక – అతనివంక కోపంగా చూసింది. శంకర్ భార్యకి చేతినందించి ఇంటిదారి పట్టించాడు. కనుచీకటిలో కరంటులైట్లు వెలిగే వేళకి ముందుగా ఒకరికొకరు ఆనుకొని నడిచారు. తన వెన్నుమీద వెచ్చని చేతి స్పర్శతో రాధ ఈ లోకంలోకి వచ్చిపడింది.

చందు కొంటెగా చూస్తున్నాడు. అతని

కళ్ళు చివరికోరిక కాంతిరేఖ. అతను — అతను తనని అలా ఆశిస్తున్నాడేవిటి? ఆశగా, ఆకలిగా, ఆత్రంగా అతను తింటుంటే — మరో నాల్గేళ్ళకి తన కొడుకు అంత విగ్రహంలా పెరిగి — ఉద్యోగరీత్యా ఎక్కడో ఇలాగే ఆశగా, గా,ఆకలి తింటాడేమో అలా అనుకొనే రాధ అతన్ని పలకరించింది. అదీగాక ఒంటరితనం ఓ కారణం కావచ్చు. స్వతహాగా ఆమె ఎవరితోనైనా చనువుగా మాట్లాడగల వ్యక్తి. ఆ చనువు ఇతనికే కాదు చాల మందికి మరోలా అన్పించేది. అయితే అది చాలాకాలం క్రిందటి మాట ఇవ్వాళ తన వయస్సు.

"మీరు అలా మౌనంగా కూర్చుంటే అందంగా ఉన్నారు. చేతిలో కుంచలేదు గాని — అద్భుతమైన చిత్రం తయారై పోయేది."

ఏమిటి ఇతని ధీమా? ఆమెకి చిర్రున కోపమొచ్చింది.

ఛ. మీరలా మాట్లాడితే వెళ్ళి పోతానంటూ లేచింది.

మెరుపులా అతను చేతో ఆమె కొంగుపట్టి ఆపేడు. ఆపడంలో ఆమె తూలి అతని పక్కన పడింది. ఒక విధంగా అతనిమీదే పడినట్లే ఇది. వెంటనే అతను చేతుల్తో చుట్టివేశాడు. క్షణంసేపు మైకంకమ్మి కదల్లేక పోయింది కాదని విదిలించుకోలేక పోయింది.

అతనివేళ్ళు వెచ్చగా వెన్నుమీదనుంచి మెడమీదకిపాకి, ముందుకు జరిగి చిక్కని సూత్రాల గొలుసును తప్పించుకొని గుండెలు నుండిపోతున్నచోట ఆగి పోయాయి. ఆమె కేమవుతుందో తెలీదు. అణువణువు అతని ఆహ్వానాన్ని అందుకుంది. కాని, మనసు ఎదిరించింది. తాను, తన వయస్సు, తన సంస్కారం, భర్త, ఇల్లు అన్నీ ఒక్కసారి కళ్ళల్లో కన్పించాయి. చందుని విడిపించుకొంది. అతనిమీద చికాకు రాదేమి. జాలో, ప్రేమో చెప్పరాని — మమకారం, ఆమె కళ్ళల్లో నిస్సహాయత నీరుగా కారింది. చందూకిఏమీ అర్థంకాలేదు. 'క్షమించండి మీ కిష్టంలేదా? పదండి వెళ్ళిపోదాం.' అని వబోయాడు. కాదు ఏంలేదు. కాసేపే పాగి వెళదాం. నా కెలాగో ఉంది. నడవ గల శక్తి లేనట్లుంది. మీరు, మీరు అతని గుండెలకి బలా నించి కన్నీ రొత్తుకుంది.

పావుగంటకి స్థిమిత పడింది ఆమె. ఈసారి టాక్సీ పిలిచాడు చందు. ఓ హోటల్లో ఇంత తిన్నామనిపించి బంగ్లాకే చేరారు. ఆమె గదిలోకి వెళ్ళే దాకా ఆగి, తను బ్యాక్ కి వెళ్ళిపోయాడు చందూ.

రాధాదేవి — తను రాధగా మిలిగి పోయింది.

సాయంకాలపు టీకి ఆమె డైనింగ్ హాల్ కి రాలేదు. ఏం చేస్తున్నదో చూద్దా మనిపించి చందు ఆమె గది వేపు పోలేదు. అతనికి ఏదోలా ఉంది. స్త్రీలు— ఇలా చిత్రంగా ఎందుకుంటారో అతనికి అంతుబట్టలేదు. తానుగా ఆమెని అవ మాన పర్చాలనుకోలేదు. అసలెందుకిలా జరిగిందో కాని — ఏనాడూ ఏ స్త్రీని ఆశించని భిన్నమైన తీరుగా ఈమెతో చనువు, ఆశలు కలిగాయి. ఆలోచిస్తూ

తన నీడను పానులో చూస్తున్నాడు. పక్కమీద పడుకొని తలుపుమీద చప్పుడు రెండు మూడుసార్లు విని రతన్ వచ్చా డనిపించింది. ఇప్పుడు తనతో మాట్లాడ గల మనశ్శాంతిలేదు. అందుకని చప్పున కళ్ళు మూసుకొని నిద్ర నటించక తప్ప లేదు. తలుపు తీసిన చప్పుడు. ఎవరో లోనికి వచ్చిన చప్పుడు – అది రతన్ బూట్లచప్పుడు మాత్రంకాదు. కళ్ళు తెరుద్దామంటే అది దొంగనిద్రాయే – మెత్తని చెప్పుల చప్పుడుతోపాటు మరో రకమైన పెర్‌ఫ్యూమ్‌డ్ వాసన గదిలో ఫాసుగాలిలో చుట్టుకుపోతున్నది. మరుక్షణం తన పక్కలో మెత్తగా కూర్చున్న అలికిడితో సన్నని గొంతుకు పలికింది.

"ఏం చేస్తున్నారు ? ఈ వేళప్పుడేం నిద్ర ?"

ఆమె ముఖం స్వచ్ఛంగా ఉంది. నుదిటి కుంకుమ అద్భుతంగా ఉంది. చిరునవ్వులో చల్లదనం, ఓదార్పు, అభయం, మమకారం, స్నేహశీలత అచ్చుగుద్దినట్టున్నాయి. అతనికి తన భార్య గుర్తొచ్చింది. యామిని ఎంతో చక్కనిది ఇలా ఎర్రటి కుంకుమ పెట్టు కుంటే ఎంత బావుంటుంది. కాని – తమ జాతిలో ఆ ఆచారం లేదు.

యామిని – యామిని మనసులో తలచుకున్నాడు. పైకిమాత్రం రండి కూర్చోండి అన్నాడు. ఆదరంగా రాధాదేవిని. నన్ను కొందరు రాధా అని పిలుస్తారు. మీరు అలాగే పిలవవచ్చు. అలా ఎక్కడికైనా వెళదామా ఇక్కడే కూర్చోమన్నారా ?

చంయు నవ్వాడు. ఆ నవ్వులో అర్థాలు శతకోటి ప్రశ్నలు. ఉండండి పదినిమిషాల్లో వెళ్దాం. అని కుర్చీమీద టవలందుకొని బాతురూమ్ వైపు కదిలాడు.

రాధ గదంతా కలియజూసింది. మేగ్‌జైనులు, నవలలు, సాక్స్, బెల్టు టై, షర్టు, ప్యాంట్లు, ఏ ఒక్కటీ ఉండాల్సిన స్థలంలో లేవు. వెంటనే ఆమె ఒక్కొక్కటి సర్దటం మొద లెట్టింది. అద్దంమీద శుభ్రంగా తుడి చింది. అందులో తనను తాను చూచుకొని ఆశ్చర్యపోయింది. తమ రాధాదేవిగా కాక పాతికేళ్ళ క్రిందటి రాధలాగే కన్పి స్తుంది. తన బుగ్గల్లో కెంపురంగు కళ్ళలో కొత్త కాంతి అసలు శరీరమే పువ్వులా తేలిపోతున్నదేమిటి ! ఓహో మనసుకి వయసుమీద ఇంత అధికార ముందా ? రాగబంధమే యౌవ్వనమా ? తను ఇంత అందంగా చీర కట్టిందా ? ఈ లేత రంగుచీర తనకు ఇంతగా నప్పిందా ? చెవుల రవ్వల కమ్మలు ధగధగలాడి పోతున్నవి. ముక్కుపోగు ఎన్నడూ లేనంత కాంతి జిమ్ముతుంది. బాతురూంలో నీళ్ళ శబ్దం సంగీతంలా వినిపిస్తుంది.

కాదు కాదు. అతను ఈలపాట పాడు తున్నాడు. తనూ పాట పాడగల్దు తియ్యగా హాయిగా మధురమధురంగా – బాత్‌రూమ్ తలుపు తెరుస్తున్న చప్పు డుకి ఆమె తేరుకొని ఏమి జరగనట్లే కుర్చీలో కూర్చుండిపోయింది. మొఖం తుడుచుకుంటూనే బట్టకోసం స్టాండు మీదకు చేయిచాపాడు. అవి చేతికి తగలక

పోవడంతో కళ్ళు తెరిచి చూశాడు. అరె గది అంతా సర్దేసుందే. బట్టలు చక్కగా మడిచి సూట్‌కేసుమీద ఉన్నవి. ఈ గది సర్దితే ఇంత విశాలంగా, అందంగా ఉంటుందని తనకు తోచనందుకు సిగ్గు పడ్డాడు. పదినిమిషాల్లో ఇంత చక్కగా సర్దిన ఈమె మంచి గృహిణి అయుండాలి. తానేమిటి అలా ఎలా ఆశించాడు. ఛ. అన్నాళ్ళు తెలుగుదేశంలో ఉండీ అక్కల్నీ, చెల్లెల్నీ, అమ్మల్నీ చూశాడు కదా తన బుద్ధి ఇలా గడ్డితింది ఎందుకని!

“క్షమించండి ఆలశ్యమైంది.”

అతని ముఖంలో ఇప్పుడు ఏవిధమైన కొంటెతనం లేదు. నిర్మలంగా, గౌరవంగా ఉంది.

రాధాదేవి ముఖం పాలిపోయింది. తాను ఏమనుకుని ఇతని దగ్గిరకి తిరిగి వచ్చింది? ఇతనిప్పుడు ఇంత ప్రశాంతంగా ఉన్నాడేంటి? తను చలించింది – అతను జ్వలించడంలేదు! ఎంతటి విపరీత స్థితి! ఆమె మాట్లాడలేకపోయింది. అతను బయటకు వెళ్ళడానికి తయారవటానికి చూపు అతని బూట్లను పాదాల క్రిందికి లాక్కుంది. అతను ప్రశ్నార్థకంగా చూశాడు. బైటకు వద్దులే ఇక్కడే కబుర్లు చెప్పుకుందాం. లేదు, నా గదికి రండి! అన్నది.

భలేవారే! అంతా మీ యిష్టమేనేమిటి? బూట్లుకోసం వొంగి ఆమె పాదాల క్రింది వాటిని అందుకోడానికి విస్సంకోచంగా ఆమె పాదాలమీద జారాడే చీర కుచ్చిళ్ళు తప్పించాడు. పసుపు, తెలుపు రంగరించి పోత పోసిన పద్మాల్లాంటి పాదాలమీద అతని చేతి వేళ్ళు క్షణంసేపు అతుక్కుపోయాయి. అతని బిల్‌క్రీమ్‌తో మెరిసే జుట్టులో ఆమె చేతివేళ్ళు హటాత్తుగా ఆమె రెండు చేతుల్లోకి అతని ముఖాన్ని తీసుకుంది. అతనలాగే కూర్చుని ఆమె ముఖంలోకి పైకి అమాయకంగా అనుమానంగా చూస్తున్నాడు. ఆమిక భరించలేనట్లు ఆ ముఖాన్ని గుండెలకు హత్తుకున్నది. పెదవుల్లో అగ్ని ఎర్రనిప్పులు అతని నుదుటిమీద ముద్రపడింది. అవును నుదుటిమీదనే! ఆత్మీయతకీ, అభిమానానికీ నిశానిగా పెట్టవలసిన స్థలం అదే.

బాబు అనాలనుకున్నది కాని పైకి అనలేకపోయింది – ఐనా అతనికి అర్థమైపోయింది. ఆమె ద్వంద్వ పరిస్థితి. ఇక ఆలస్యంజేస్తే ఇద్దరికీ మంచిది కాదు. అప్రయత్నంగా అతని నోటి నుంచి “మా” అనే మాట వెలువడింది. ఆమె పాదాలమీద అతని చేతులు కదిలి జోడించి నమస్కార రూపం దాల్చాయి. ఆమె కళ్ళలో నీళ్ళు నిలబడలేక జారి ధారగా కారి అతన్ని ఆశీర్వదించి అమృతపు జల్లులా రాలాయి.